తరంగాలు
జాతీయ దినపత్రిక
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
94949 23460

ఎడిటర్ : [illegible] నాగరాజు
RNI . TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...
హైదరాబాద్
సోమవారం
18 ఆగస్టు 2025
సంపుటి : 367
సంచిక : 2
పేజీలు : 8
వెల రూ.5.00
Epaper : WWW.tharangalu.comEpa
Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna

## తమిళనాడు ఓబీసీ నేతను ఎంపిక చేసిన బీజేపీ

## ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా
# సీపీ రాధాకృష్ణన్

### తమిళనాడు ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ఎంపిక





- ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం.. గవర్నర్‌గా విశేష అనుభవం
- ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా సీపీ బాధ్యతలు
- అభ్యర్థిని ఇంకా ప్రకటించని ఇండియా కూటమి
- నామినేషన్ దాఖలుకు ఈ నెల 21 ఆఖరు తేదీ

న్యూఢిల్లీ,

వచ్చే నెల 9న జరిగే ఉప రాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి ఎన్‌డీఏ కూటమి తమ అభ్యర్థిని ప్రకటించింది. మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ (67)ను తమ అభ్యర్థిగా బీజేపీ పార్లమెంటరీ బోర్డు సమావేశంలో ఎంపిక చేసినట్టు కూటమికి నేతృత్వం వహిస్తున్న బీజేపీ ఆదివారం వెల్లడించింది. తమిళనాడుకు చెందిన రాధాకృష్ణన్‌కు ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో విశేష అనుభవం ఉంది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆ రాష్ట్రానికి చెందిన అభ్యర్థిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసి ఉంటారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో తాము విపక్షాలతో కూడా సంప్రదిస్తున్నామని, ఉప రాష్ట్రపతిని ఏకగ్రీవంగా -మిగతా 2 లో



## 21న ఓయూలో హాస్టల్స్ ప్రారంభం

- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరు
- సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి.
- ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7,223 మంది విద్యార్థులు

హైదరాబాద్

ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 21న జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు ఆదివారం ఆ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం హైదరాబాద్ జూబ్లిహిల్స్ లోని సీఎం నివాసంలో ఆయన్ను కలిసి -మిగతా 2 లో



## శిశువులకు జన్మనిచ్చే రోబో

- చైనాలో పరిశోధకుల అద్భుత సృష్టి
- ప్రపంచంలో తొలి ప్రెగ్నెన్సీ రోబో ఇదే
- వచ్చే ఏడాది చివరిలోగా ప్రొటోటైప్ రెడీ

న్యూఢిల్లీ,

చైనాలో పరిశోధకులు ప్రెగ్నెన్సీ హ్యూమనాయిడ్ రోబోను అభివృద్ధి చేస్తున్నారు. గర్భాన్ని ధరించడంతోపాటు కృత్రిమ గర్భంలో నవమాసాలు శిశువును మోసి, సురక్షితంగా ప్రసవించడం ఈ రోబో ప్రత్యేకత. ప్రపంచంలో తొలి 'ప్రెగ్నెన్సీ రోబో' ఇదే. సింగపూర్‌లోని నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ శాస్త్రవేత్త డాక్టర్ జాంగ్ కిఫెంగ్ నేతృత్వంలో ఈ రోబోను అభివృద్ధి చేస్తున్నట్టు చైనా మీడియా వెల్లడించింది. -మిగతా 2 లో

# బీజేపీ ఓట్ చోర్

### ఈసీతో కలిసి కుతంత్రాలు

- వారి కుట్రను ఇండియా బ్లాక్ అనుమతించదు
- ప్రమాదంలో రాజ్యాంగం.. ప్రజలు ఐక్యంగా ఉండాలి
- బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర'ను ప్రారంభించిన రాహుల్ గాంధీ
- పాల్గొన్న ఖర్గే, లాలూ, తేజస్వీపలువురు ఇండియా బ్లాక్ నేతలు




పాట్నా

పేదలకు ఉన్న ఏకైక శక్తి వారి ఓటు అనీ, అది కూడా చోరీకి గురవుతున్నదని బీజేపీ టార్గెట్‌గా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీహార్‌లోని సాసారం నగరంలో 'ఓటర్ అధికార్ యాత్ర'ను ఆయన ప్రారంభించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం (ఈసీ) చేపట్టిన ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా రాహుల్ ఈ నిరసన ర్యాలీని చేపట్టారు. 16 రోజుల పాటు జరిగే ఈ యాత్ర సెప్టెంబర్ 1న పాట్నాలో ర్యాలీతో ముగుస్తుంది. ఈ యాత్ర బీహార్‌లోని మొత్తం 25 జిల్లాలను కవర్ చేస్తూ 1300 కిలో మీటర్లు సాగనున్నది. ఈ యాత్రలో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ -మిగతా 2 లో

## యుద్ధానికి తెర పడుతుందా..

- నేడు ట్రంప్-జెలెన్‌స్కీ కీలక చర్చలు



న్యూయార్క్, ఆగస్టు 17

రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు జరుగుతున్న తీవ్ర ప్రయత్నాల్లో తుది అడుగుగా భావించే చర్చలకు అమెరికా వేదిక కానున్నది. ఇరు దేశా ల సంఘర్షణకు తెరదించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రం ప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ నేతలు సోమవారం సమావేశం కానున్నారు. అలస్కాలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో చర్చల తర్వాత ట్రంప్ నేరుగా జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. యుద్ధానికి ఒక ముగింపు పలికేందుకు సోమవారం చర్చలు జరపాలని ప్రతిపాదించగా, దానికి జెలెన్‌స్కీ అంగీకరించారు. దీంతో సోమవారం నాటి చర్చల్లో జెలెన్‌స్కీతో పాటు ఆయనకు మద్దతుగా పలువురు యూరోపియన్ నేతలు కూడా పాల్గొంటున్నారు. అలస్కా చర్చలు పూర్తి ఫలవంతంగా జరిగాయని ప్రకటించిన ట్రంప్, ఆ సమావేశంలో ఎలాంటి ఒప్పందం కుదరలేదని వెల్లడించారు.కాగా, తాను ట్రంప్‌తో సుదీర్ఘమైన, ముఖ్యమైన సంభాషణ జరిపానని, యూరోపియన్ నేతలు కూడా తనతో -మిగతా 2 లో



## బీసీ రిజర్వేషన్లపై
# కార్యాచరణ

- 20 లేదా 21న.. పీఏసీ భేటీలో చర్చించాక తుది నిర్ణయం

హైదరాబాద్,

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, దాంతో ముడిపడి ఉన్న 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశం'పై ఎలా ముందుకెళ్లాలనే దానిపై త్వరలోనే అధికార కాంగ్రెస్ ఒక నిర్ణయం తీసుకోనుంది. ఇందుకోసం రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం నిర్వహించి, అందులో చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. రిజర్వేషన్లపై ఒక నిర్ణయానికి వస్తే స్థానిక ఎన్నికల నిర్వహణకు సంబంధించిన -మిగతా 2 లో

## ఫ్యూచర్ సిటీకి
# ఫ్యూచర్ లేదు

### విజన్ లేని సర్కారు వల్ల ప్రజాధనం వృథా అయ్యింది

- రియల్టీ కోసం వాడలేరని అసెంబ్లీలోనే హెచ్చరించిన!
- వేల కోట్ల రూపాయల ఫార్మాసిటీ పెట్టుబడులు వెనకి
- యువతకు లక్షల ఉద్యోగాలు రాకుండా పోయినయ్
- ఫార్మాసిటీ భూములపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలి
- లేనిపక్షంలో రైతుల తరఫున బీఆర్‌ఎస్ ఉద్యమం
- ప్రభుత్వానికి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక




హైదరాబాద్,

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పదేపదే చెప్పిన ఊహాజనిత ఫ్యూచర్‌సిటీకి భవిష్యత్తు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. తన కుటుంబసభ్యులు, స్నేహితుల ప్రయోజనాల కోసం హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో రియల్ఎస్టేట్ వ్యాపారం చేయాలనే రేవంత్‌రెడ్డి ఆకాంక్ష నెరవేరబోదని హెచ్చరించారు. ఫార్మాసిటీ భూముల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కేటీఆర్ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విజన్ లేని నాయకుడని, ఆయన తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ప్రజాధనం వృథా అవుతున్నదని ఆరోపించారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులు -మిగతా 2 లో

## బురద రాజకీయాలు మానుకోండి

- వరద నీళ్లు ఒడిసిపట్టండి..
- రేవంత్ సర్కార్‌కు హరీశ్‌రావు హెచ్చరిక



సిద్దిపేట

కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయకుండా సముద్రం పాలు చేస్తున్న రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. వరద నీళ్లను ఒడిసిపట్టి.. బురద రాజకీయాలను మానుకోవాలని రేవంత్ సర్కార్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. -మిగతా 2 లో

## రాజగోపాల్‌రెడ్డి వినకపోతే వేటు తప్పదు

- కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రవి



హైదరాబాద్,

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వివాదంపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్‌రెడ్డి ఎంత చెప్పినా వినకుంటే వేటు తప్పదంటూ హెచ్చరించారు. ఆదివారం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజగోపాల్‌రెడ్డి అంశంపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తనతో చర్చించారని, దీనిపై సమాచారం తెప్పించుకొని -మిగతా 2 లో

# 21న ఓయూలో హాస్టల్స్ ప్రారంభం

(మొదటి తరువాయి)

కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఓయూలో రూ.80 కోట్ల వ్యయంతో నిర్మాణమై 1,200 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు హాస్టల్స్‌ను ప్రారంభించి, గిరిజన సంక్షేమం శాఖ ఆర్థిక సహాయంతో మరో 300 మంది విద్యార్థులకు వసతి కల్పించే రెండు కొత్త హాస్టల్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం సీఎం చేతులమీదు గా జరుగనున్నది. ఇప్పటికే ఓయూలో ఉన్న 25 హాస్టళ్లలో 7,223 మంది విద్యార్థులకు వసతి ఉండగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించే హాస్టల్స్ అదనపు వసతిని సమకూర్చనున్నాయి. ఇదే కార్యక్రమంలో దాదాపు రూ.10 కోట్ల నిధులతో డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూం పనులకు కూడా సీఎం ప్రారంభించనున్నారు. అదే రోజు ఓయూలో ఉన్న టాగూర్ ఆడిటోరియంలో వెయ్యి మంది ప్రొఫెసర్లను, విద్యార్థులను ఉద్దేశించి "తెలంగాణ విద్యా రంగంలో రావాల్సిన మార్పులు-ప్రభుత్వ ప్రణాళిక" అనే విషయంపై సీఎం ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొననున్నారు. గడిచిన 20 ఏళ్ల కాలంలో ఓయూలోకి ముఖ్యమంత్రి హౌదాలో వచ్చి ప్రసంగించనున్న తొలి సీఎం రేవంత్ రెడ్డియేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో "సీఎం రీసెర్చ్ ఫెలో షిప్ " తో పాటు విదేశీ పర్యటనకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వీసీ తెలిపారు.

# శిశువులకు జన్మనిచ్చే రోబో

(మొదటి తరువాయి)

నెలలు నిండకుండా జన్మించే శిశువుల సంరక్షణ కోసం ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంక్యుబేటర్ల కంటే ఈ రోబో చాలా భిన్నమైనది. గర్భాన్ని ధరించడం మొదలుకొని శిశువు జననం వరకు మొత్తం గర్భధారణ ప్రక్రియను ఈ రోబో అనుకరిస్తుంది. అంటే గర్భధారణ నుంచి ప్రసవం వరకు శిశువు పూర్తిగా హ్యూమనాయిడ్ రోబోలోని టెక్ గర్భంలో పెరుగుతుంది. ఈ ప్రాజెక్టులో కృత్రిమ గర్భ సాంకేతికత (ఆర్టిఫిషియల్ ఊంబ్ టెక్నాలజీ) ప్రధానమైనది. రోబో బొడ్డులో అమ్నియోటిక్ ద్రవంతో నింపిన కృత్రిమ గర్భం మానవ గర్భాన్ని అనుకరిస్తూ పిండం పెరుగుదలకు అనువైన పరిస్థితిని కల్పిస్తుంది. సహజంగా జన్మించే శిశువుకు జరాయువు (ప్లాసెంటా) ద్వారా పోషకాలు అందినట్టు ప్రెగ్నెన్సీ రోబోలో కృత్రిమ గర్భానికి జత చేసిన ట్యూబ్ ద్వారా శిశువుకు పోషకాలు అందుతాయి. కృత్రిమ గర్భ సాంకేతికత ఇప్పటికే పరిణితి చెందిన దశలో ఉన్నదని, ఇప్పుడు దీన్ని రోబో ఉదరంలో అమర్చాల్సిన అవసరం ఉన్నదని, తద్వారా నిజమైన వ్యక్తి ఆ రోబోతో ఇంటరాక్ట్ అయి గర్భధారణకు, ఆ గర్భంలో పిండం పెరుగుదలకు వీలు కల్పించాల్సి ఉన్నదని డాక్టర్ జాంగ్ వివరించారు. నిజానికి ఇదేమీ పూర్తిగా కొత్త భావన కాదని, గతంలో కొందరు శాస్త్రవేత్తలు ఓ 'బయోబ్యాగ్'లో గొర్రెపిల్లను విజయవంతంగా పెంచారని, ఆర్టిఫిషియల్ ఊంబ్ ఆలోచనకు అప్పుడే బీజం పడిందని తెలిపారు. ప్రెగ్నెన్సీ రోబో ప్రొటోటైప్ (నమూనా) వచ్చే ఏడాది చివరి నాటికి సిద్ధమవుతుందని, అందుకు దాదాపు లక్ష యువాన్లు (రూ.12.96 లక్షలు) ఖర్చవుతుందని అంచనా.

# యుద్ధానికి తెర పడుతుందా..

(మొదటి తరువాయి)

కలిశారని, చాలా ముఖ్యమైన అంశాలు చర్చించినట్టు జెలెన్స్కీ తెలిపారు. రెండు దేశాల మధ్య యుద్ధానికి ముగింపు పలికేందుకు సోమవారం తాను యూఎస్‌కు బయలుదేరుతున్నట్టు ఆయన చెప్పారు. చర్చలకు ఆహ్వానం పలికిన ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి అంతం పలికేందుకు, సాధారణ ప్రజల మరణాలకు ముగింపు పలికే దిశగా ట్రంప్‌తో సమగ్రంగా చర్చిస్తానని జెలెన్స్కీ సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టారు. ఉక్రెయిన్-రష్యా సంఘర్షణను తెరదించడానికి యూరోపియన్ దేశాలు సహకరించాలని ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు. అమెరికాతో పాటు యూరోపియన్ దేశాల నుంచి తమ భద్రతకు హామీ కోరుతున్నామన్నారు. సెక్యూరిటీ గ్యారంటీ కావాలని ఉద్ఘాటించారు.

**చర్చల్లో ఎవరెవరు?**

యూఎస్‌లో సోమవారం నాటి చర్చల్లో ట్రంప్, జెలెన్స్కీతో పాటు ఆయ నకు మద్దతుగా యూరప్ నేతలు కూడా పాల్గొంటున్నారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమాన్యుయల్ మాక్రాన్, జర్మన్ చాన్సలర్ ఫ్రెడ్రిచ్ మెర్జ్, ఫిన్నిష్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సుల వాండర్ లేయన్, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే తదితరులు చర్చల్లో పాల్గొంటున్నారు.

# బీసీ రిజర్వేషన్లపై కార్యాచరణ

(మొదటి తరువాయి)

అంశంపైనా సమావేశంలోనే చర్చించనున్నట్టు సమాచారం. ఈ మేరకు పీఏసీ సమావేశాన్ని ఈ నెల 20 లేదా 21న నిర్వహించే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. వాస్తవానికి 18వ తేదీనే క్యాబినెట్ భేటీ నిర్వహించి, ఆ తరువాత పీఏసీ సమావేశం పెట్టి ఒక నిర్ణయం తీసుకోవాలని భావించారు. కానీ రాష్ట్రంలో వారం నుంచి వానలు కురుస్తుండడం, మరో 2-3 రోజులపాటు భారీ వర్షాలు ఉండొచ్చన్న వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో వాయిదా వేశారు. ఇక.. 22న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారు. ఆయన తిరిగొచ్చిన తరువాత.. 23 లేదా 24న క్యాబినేట్ భేటీ ఉంటుందని అధికారికవర్గాలు అంటున్నాయి. బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికల నిర్వహణ పై ఈ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకోనున్నారు. ఆ తరువాత అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది. స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఇప్పటికే అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపిన సంగతి తెలిసిందే. దీనిపై కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా నిర్వహించింది. అయితే, కేంద్రం నుంచి దీనిపై ఇంకా సమాధానం రాలేదు. ఈ నేపథ్యంలో ఆ బిల్లులపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేయనున్నట్టు సమాచారం. అలాగే రిజర్వేషన్ల అంశంపై అన్ని పార్టీల వైఖరిని కూడా ప్రభుత్వం తెలుసుకోనుంది. కాగా.. వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు ఈ నెల చివరి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలున్నట్టు సమాచారం. ఈసారి సభలో బీసీల రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ఇచ్చిన నివేదిక కూడా ప్ర?ధానాంశం కానుంది. ఆ నివేదికను సభలో మొత్తం సభ్యులందరికి అందించి, దానిపై చర్చ పెట్టనున్నారు. అలాగే కాళేశ్వరం నిర్మాణ నుంచి కూలడం వరకు జరిగిన పరిణామక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ రూపంలో సభలోని సభ్యులకు వివరించే అవకాశం ఉందని కూడా తెలిసింది.

# ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్

(మొదటి తరువాయి)

ఎన్నుకోవడానికి సహకరించాలని వారిని కోరుతున్నామని బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు.

పార్లమెంట్ ఉభయ సభల్లో 786 మంది సభ్యులుండగా, ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడానికి కనీసం 394 ఓట్లు అవసరం. అయితే ఎన్డీఏ కూటమికి రెండు సభల్లో కలిపి 422 ఓట్లు ఉన్నాయి. దీంతో ఆ అభ్యర్థి ఎన్నిక నల్లేరు మీద బండిగా భావిస్తున్నారు. కాగా, ఇంతకుముందు ఉప రాష్ట్రపతిగా పనిచేసిన జగదీప్ ధన్‌ఖడ్ కూడా ఆ పదవికిలోకి రాకముందు గవర్నర్‌గా పనిచేశారు. ఈ ఎన్నికకు నామినేషన్ దాఖలుకు ఆగస్టు 21 ఆఖరు తేదీ. ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖ నేతలు సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థిని పోటీకి దింపేందుకు సోమవారం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కార్యాలయంలో సమావేశం కానున్నట్టు ఇండియా కూటమి తెలిపింది.

**తమిళనాడు మోదీ'గా గుర్తింపు**

ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ 1957, అక్టోబర్ 20న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. తమిళనాడులో ప్రభావవంతమైన గౌండర్ సామాజిక వర్గానికి చెందిన ఈ ఓబీసీ నేతకు ఆర్ఎస్ఎస్ నేపథ్యంతో పాటు రాజకీయాల్లో సుమారు 40 ఏండ్ల అనుభవం ఉంది. తమిళనాడు మోదీగా ఆయనను పిలుస్తారు. 2003 నుంచి 2006 వరకు ఆయన తమిళనాడు బీజేపీ అధ్యక్షునిగా పనిచేశారు. విశేష రాజకీయ అనుభవం ఉన్న ఆయన తమిళనాడులో రెండు సార్లు ఎంపీగా చేశారు. మహారాష్ట్ర గవర్నర్‌గా 2024, జూలై 31న బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు 2023 ఫిబ్రవరి 18 నుంచి 2024 జూలై 30 వరకు జార?ండ్ గవర్నర్‌గా, 2024 మార్చి నుంచి జూలై వరకు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి లెఫ్ట్‌నెంట్ గవర్నర్‌గా 2024 మార్చి నుంచి ఆగస్టు వరకు పనిచేశారు.

# బీజేపీ ఓట్ చోర్

(మొదటి తరువాయి)

ఖర్గే, బీహార్ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ కీలక నేత తేజస్వీ యాదవ్, సీపీఐ(ఎం-ఎల్) లిబరేషన్ నాయకులు దీపాంకర్ భట్టాచార్య వంటి ఇండియా బ్లాక్ నేతలు పాల్గొన్నారు. ఇప్పటికే 'ఓట్ చోరీ' పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆందోళనలను నిర్వహించిన విషయం విదితమే. ఈ ప్రారంభోత్సవ సభలో రాహుల్ ప్రసంగించారు. బీజేపీ రాజ్యాంగాన్ని బలహీనపరుస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో విజయాలను సాధించటానికి అవకతవకలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. " లక్షలాది మంది ఓటు హక్కును తొలగించటానికి బీజేపీ ఓటర్లను అణచివేస్తున్నది.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలను మార్చటం వంటి సందేహాస్పదమైన పద్ధతులను ఉపయోగిస్తున్నది. రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నది. పేదలకు ఉన్న ఏకైక శక్తి వారి ఓటు. అది కూడా చోరీకి గురవుతున్నది" అని రాహుల్ అన్నారు. ఇలాంటి వ్యూహాలకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈసీతో కలిసి బీజేపీ ఎన్నికల్లో ఓట్లను దొంగిలిస్తోందనీ, ఇప్పుడిది ప్రపంచం మొత్తానికీ తెలుసు అని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను దొంగిలించటానికి, వారి కుట్రలో విజయం సాధించటానికి ఇండియా బ్లాక్ అనుమతించబోదని చెప్పారు. ఓట్ల చోరీ ఆరోపణలపై ఈసీ తన నుంచి అఫిడవిట్ కోరిందనీ, బీజేపీ నేతలు కూడా ఇదే విధమైన ఆరోపణలు చేస్తే మాత్రం ఈ ప్రస్తావనను తీసుకురాలేదని రాహుల్ అన్నారు.

బీజేపీ, ఆరెస్సెస్‌లు రాజ్యాంగాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయనీ, ఇది రాజ్యాంగాన్ని కాపాడటానికి జరుగుతున్న పోరాటమని ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లను దొంగిలిస్తున్నారనీ, బీహార్‌లో ఓట్లను దొంగిలించడానికి ఎస్ఐఆర్ ద్వారా ఓటర్లను తొలగించి, చేర్చడమే వారి కుట్ర అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఇండియా బ్లాక్ సత్తా చాటిందనీ, మహారాష్ట్రలో ఎగ్జిట్‌పోల్స్ సర్వేలోనూ ఇండియా బ్లాక్ విజయం సాధిస్తుందని చెప్పాయని, కానీ నాలుగు నెలల్లో కోటి మందికి పైగా ఓటర్లు చేరటంతో బీజేపీ గెలిచిందని చెప్పారు. ఓటర్లను చేర్చిన నియోజకవర్గాల్లో బీజేపీ విజయం సాధించిందని అన్నారు. కర్నాటకలోని ఒకే నియోజకవర్గంలో లక్షకు పైగా ఓట్లు తారుమార య్యాయని దర్యాప్తులో తేలిందనీ, ఓటర్లను మోసం చేశారని రాహుల్ ఆరోపించారు. ఈ యాత్రను ఆయన ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటంగా, రాజ్యాంగ విలువలను కాపాడే ఉద్యమంగా అభివర్ణించారు. ప్రజలు తమ ఓటు హక్కులను కాపాడుకోవాలని రాహుల్ పిలుపునిచ్చారు.

**రెండో స్వాతంత్ర్య పోరాటానికి సమానం : లాలూ**

ఎన్డీఏ బీహార్‌లో 65 లక్షల మంది ఓటర్ల ఓటు హక్కును కోల్పోయేలా చేసిన ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓటర్ల అణచివేతను జరుపుతున్నదని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోపించారు. ఈ సమావేశంలో అక్కడి జనసమూహాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. "మేము ప్రజాస్వామ్యం కోసం త్యాగాలు చేశాం. ఈ యాత్ర రెండో స్వాతంత్ర్య పోరాటానికి సమానమైన ఉద్యమానికి నాంది పలుకుతుంది" అని లాలూ అన్నారు.

**ఈసీ విఫలం : ఖర్గే**

ఈసీ అన్ని రికార్డులనూ అందుబాటులో ఉంచినప్పటికీ.. ఓటర్ల డేటాలో వ్యత్యాసాలను పరిష్కరించటంలో విఫలమైందని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపించారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం రాజ్యాంగానికి ముప్పు పొంచి ఉన్నదని అన్నారు. సాధారణ పౌరుల ప్రజాస్వామ్య హక్కులను కాపాడటానికి ఈ యాత్ర 'చారిత్రక పోరాటం' అని ఆయన అభివర్ణించారు. ఈ యాత్ర పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాల కోసం జరిగే పోరాటమని తేజస్వీ యాదవ్ అన్నారు. బీజేపీ నిరంకుశ వ్యూహాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేయటం ఈయాత్ర లక్ష్యమని చెప్పారు.

# ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

(మొదటి తరువాయి)

మోసపోయారని ఆవేదన వ్యక్తంచేశారు.

**ఫ్యూచర్‌సిటీ ఊహాజనిత ప్రాజెక్టు**

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేసి, దాని స్థానంలో ఫ్యూచర్‌సిటీ అనే అవాస్తవ, ఊహాజనిత ప్రాజెక్టును ప్రవేశపెట్టారని కేటీఆర్ దుయ్యబట్టారు. నిర్లక్ష్య నాయకుడు రాష్ట్రాన్ని పాలిస్తే ఏమవుతుందో చెప్పడానికి ఫ్యూచర్‌సిటీ అనే ప్రచారం ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. భూసేకరణ చట్టం-2013 ప్రకారం.. ఒక నిర్దిష్ట ప్రజాప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్‌ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని స్పష్టంచేశారు. ఈ చట్టాన్ని ఉటంకిస్తూ, తాను రెండేండ్ల క్రితమే అసెంబ్లీలో ఈ విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించానని గుర్తుచేశారు. అయినా, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు పీఆర్ కోసం ఖర్చు చేసి, ఇప్పుడు తీవ్రమైన న్యాయపరమైన అడ్డంకులను ఎదురొంటున్నదని, చివరికి అధికారులు కూడా దీనిని అంగీకరిస్తున్నారని తెలిపారు.

# రాజగోపాల్‌రెడ్డి వినకపోతే వేటు తప్పదు

(మొదటి తరువాయి)



పరిశీలిస్తానని స్పష్టంచేశారు. మంత్రి పదవి విషయంలో రాజగోపాల్‌రెడ్డి పదే పదే ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారని, దీనిపై వివరాలు సేకరిస్తున్నామని, పూర్తి వివరాలు వచ్చాక వచ్చే వారం మరోసారి సమావేశమై చర్చిస్తామని చెప్పారు. ఇక వరంగల్ జిల్లా నేతల పంచాయితీపై నలుగురు సభ్యులతో కమిటీని నియమించనున్నట్టు తెలిపారు

# బురద రాజకీయాలు మానుకోండి

(మొదటి తరువాయి)



సిద్దిపేటలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.కాళేశ్వరం మోటార్లపై కాంగ్రెస్ కుట్ర పన్నింది. మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ చేస్తున్నారు. అవేమన్న మీ ఇంట్లో ఉండే మోటార్లు అనుకున్నారా? అలా చేస్తే మోటార్లు పాడైతాయి. బేరింగ్లు పోతాయి.. వేలకోట్ల నష్టం వాటిల్లుతుంది. ఈ విషయంపై బీహెచ్‌ఈఎల్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. మోటార్లు పనికిరాకుండా అయితే మళ్లీ ఆ బద్నాం బీఆర్ఎస్ పార్టీపై వేయాలని చూస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి, ఉత్తం కుమార్ రెడ్డికి నీళ్ల విలువ తెలియదు. కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నది. కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఉంటే, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదులుతూ ప్రాజెక్టును పడావు పెట్టింది. ఇప్పటికైనా బురద రాజకీయాలు మాని వరద నీటిని ఒడిసి పట్టండి అని హరీశ్‌రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి నష్టం కలుగుతున్నది. ఉన్న వ్యవస్థను నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదా..? కమీషన్లకు, వాటాలు పంచుకోవడానికి సమయం సరిపోతలేదా..? రైతు ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమా ? నంది మేడారంలో ఖటక ఒత్తితే రోజుకి రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయి. వారం రోజుల కిందనే ఈ విషయాన్ని ఉత్తంకుమార్ రెడ్డికి తెలుపుతూ ఉత్తరం రాశాను. అన్నపూర్ణ రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి. చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయి. నీళ్లను ఒడిసి పట్టండి. వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నపం చేశాను. దురదృష్టం ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ క్రిమినల్ నెగ్లిజెన్సీ.. నీళ్ల విలువ రైతులకు తెలుస్తది.. ఉత్తంకుమార్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి తెలియదు. కేసీఆర్ కేంద్ర మంత్రిగా ఉన్నా, ముఖ్యమంత్రిగా ఉన్నా వ్యవసాయం చేసే ఒక రైతు. ఆయన రైతు గనుక ప్రతి చుక్కను ఒడిసిపట్టి నీళ్లను రైతులకు అందించాడు. మీరు ఎన్నడు వ్యవసాయం చేయలేదు అందుకే మీకు నేల విలువ తెలియదు. ఈ రోజు కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలయితుంటే గుడ్లప్పగించి రేవంత్ రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి చూడడం తప్ప ఏం చేయడం లేదు. కాంగ్రెస్ సర్కార్ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు





**-ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి.సాంబశివరావు**

**చెన్నారావుపేట, ఆగస్టు 17,తరంగాలు :** ఎవరైనా విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే వారిపైన కఠిన చర్యలు ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి.సాంబశివరావు హెచ్చరించారు. ఆదివారంచెన్నారావుపేట, ఖానాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి.సాంబశివరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాప్తి చెందె వ్యాధులు మలేరియా, ఫైలేరియా, చికెన్ గునియా, మెదడు వాపు, డెంగ్యూ, తీవ్రమైన నీళ్ల విరేచనాలు, బంక విరోచనాలు, హెపటైటిస్, టైఫాయిడ్ మొదలగు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. కావున ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత,పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వేడిచేసి చల్లార్చిన నీటిని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు.ఎవరికైనా ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైన వెంటనే వైద్య సిబ్బంది ద్వారా తగిన పరీక్షలు,చికిత్సలు చేయించుకోవాలని కోరారు.వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కి ఎలాంటి సెలవులు లేవని, ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించి ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వారు హెడ్ క్వార్టర్స్ నుండి ఎక్కడికి వెళ్లరాదని తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చెన్నారావుపేటలో నిన్న సిబ్బంది భోజనాల సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తాళం వేసినట్లు తన దృష్టికి వచ్చింది ఇలాంటివి పునరావృతం అయితే వారి జీతాలు నిలిపివేస్తూ పై అధికారులకు తెలియజేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ప్రతి ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది క్రమం తప్పకుండా సమయపాలన పాటిస్తూ ఉద్యోగ ధర్మం నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది,సీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కోటగుళ్లలో సోమవారం నందీశ్వరుని రెండవ వార్షికోత్సవం

**-కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పూజలు**
**-గణపేశ్వరుడికి బిల్వార్చన**



**గణపురం, ఆగస్టు 17 తరంగాలు:** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరుడి రెండవ వార్షికోత్సవాన్ని కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. నందీశ్వరుడి ప్రతిష్టాపన కార్యక్రమం రెండు సంవత్సరాలు పూర్తయి మూడో సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా నందీశ్వరుడికి త్రివేణి సంగమం జలాభిషేకం, రుద్రాభిషేకం, గణపేశ్వరుడికి బిల్వార్చన నిర్వహించనున్నారు. శ్రావణమాసం చివరి సోమవారం జరిగే నందీశ్వరుడి వార్షికోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ విజ్ఞప్తి చేసింది.

# పే బ్యాక్ టు ది సొసైటీ సిద్ధాంతం కొనసాగిద్దాం

**-మాదిగ పేద విద్యార్థులకి ఆర్థిక సహాయం**
**-మహా ఆది సేవా సంస్థ ఉమ్మడి జిల్లా ఇన్చార్జ్ సీనపల్లి విజయకుమార్**




**వర్ధన్నపేట ప్రతినిధి,ఆగస్టు 17,తరంగాలు:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పిలుపైన పే బ్యాక్ టు ది సొసైటీ కొనసాగిద్దామని మహా ఆది సేవా సంస్థ ఉమ్మడి జిల్లా వరంగల్ ఇన్చార్జ్ సీనపల్లి విజయకుమార్ అన్నారు.మహా ఆది సేవ సమితి(మాస్)మాదిగ కులంలోని పేద విద్యార్థులకి ఆర్థిక సహాయం చేయడం లో భాగంగా ఆదివారం స్వస్థలం హన్మకొండ జిల్లా, పరకాల మండలం, మల్లక్కపేట గ్రామ నిరుపేద తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ విద్యార్థి దొమ్మాటి రాజు హనుమకొండలోని ఎస్ పి ఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుండగా ఫీజు, బుక్స్ నిమిత్తం మాస్ సంస్థ పెద్దలు డాక్టర్ సీనపెల్లి విజయ్ కుమార్, డాక్టర్. సీనపెల్లి విక్రమ్ కుమార్, మారపెల్లి ప్రభాకర్, కలకోల అశోక్ బాబులు విద్యార్థి దొమ్మటి రాజుకు రూ. 30,000 రూపాయలు సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాస్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ పిలుపైన పే బ్యాక్ టు ది సొసైటీ సిద్ధాంతం మీద మాస్ సంస్థ గత 5 సంవత్సరాలుగా మాదిగ కులానికి చెందిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు మన రెండు తెలుగు రాష్ట్రాలలో 204 మాదిగ విద్యార్థులకి ఇందిలో 48 వైద్య విద్యార్థులకు సహాయం అందించడం జరిగిందన్నారు. మన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 19 మంది వైద్య విద్యార్థులకి సహాయం చేయడం జరిగినదనీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో ఇప్పటివరకు మొత్తం రూ. 25,78,208 రూపాయల సహాయం చేసినట్లు తెలిపారు. ఆర్థిక మేసులుబాటు లేక చదువు ఆగిపోకూడదని మాదిగ కులంలో పుట్టి ఉన్నత విద్యాభ్యశించి వివిధ హోదాలలో ఉద్యోగం చేస్తున్న అంబేద్కర్ వాదులు మాస్ లో సభ్యులుగా చేరి నెల నెల చందాలు వేసుకొని" మాస్ " రిజిస్టర్డ్ సంస్థ ద్వారా పేద పిల్లల చదువుకి అవసరమైన సహాయం చేయడం జరుగుతంది అని తెలియచేసారు. ఎవరైనా పేద మాదిగ విద్యార్థులు ఉన్నత విద్యకై ఆర్థికపారమైన ఇబ్బంది ఉన్న , పేద విద్యార్థులకి సహాయం చేయదలచిన దాతలు క్రింద నెంబర్ 9010730380 కి కాల్ చేయగలరని తెలిపారు.

# ఘనంగా పోచమ్మ తల్లికి మొక్కులు

**గ్రామ దేవతలకు తొలి పూజలు**
**అమ్మవారికి బోనం సమర్పించిన మహిళలు**





**గణపురం ఆగస్టు 17 తరంగాలు:** పవిత్ర శ్రావణమాసం సందర్భంగా ఆదివారం గ్రామస్తులు పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించారు. కుటుంబ సమేతంగా తరలివెల్లి మొదట గ్రామదేవతల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి పోచమ్మ తల్లికి మహిళలు బోనం సమర్పించారు. అమ్మవారికి చీర సారె నైవేద్యం సమర్పించి ఎదురు పిల్లలను ఇచ్చి ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని పంటలు పండాలని పిల్లాపాప చల్లగా ఉండాలని చల్లని తల్లి పోచమ్మ ను వేడుకున్నారు.

# రైతుల యూరియా సమస్యను పరిష్కరించాలి



**-పలు సహకార సంఘాల కేంద్రాలను సందర్శించిన మానవ హక్కుల సంఘం అధ్యక్షులు మంగళపల్లి హుస్సేన్**









**(మహబూబాబాద్, ప్రతినిధి, ఆగస్ట్. 17, తరంగాలు** మహబూబాబాద్ జిల్లా లో పలు రైతువేదికలు, సహకార సంఘాల కేంద్రాలను సందర్శించిన నేషనల్ హ్యూమన్ రైట్స్ ఫర్ జస్టిస్ జాతీయ అధ్యక్షులు మంగళపెల్లి హుస్సేన్ సందర్శించారు.రైతులకు సరిపడా యురియా అందించాలంటూ మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి,దనెల్లికుదురు, తొర్రూర్, మరిపెడ, డోర్నకల్,కురవి,కేసముద్రం, మహబూబాబాద్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల వద్ద,సహకార సంఘాల కేంద్రాల ఎదుట రహదారి పై రైతులు రాస్తారోకో చేపట్టాల్సిన ఖర్మ ఏంటని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు కలెక్టర్ వెంటనే సత్వర చర్యలు తీసుకుని రైతుల సమస్యలు తీర్చాలని నేషనల్ హ్యూమాన్ రైట్స్ ఫర్ జస్టిస్ జాతియ అధ్యక్షులు మంగళంపల్లి హుస్సేన్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో మొక్క జొన్న, వరి సాగు చేసే రైతులకు సరైన సమయమంలో యూరియా ఎంతో అవుసరమవుతున్న నేపథ్యంలో ఎరువుల కోసం రైతులు క్యూలైన్ లో నిల్చోవాల్సిన దుస్థితి,ధర్నాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ధ్వజమెత్తారు.రైతులకు తమ ఆధార్ కార్డుకు రెండు బస్తాలు యూరియా అందచేయడంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నరన్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు సరిపడా యురియాను అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బద్దె వీరభద్రం, మహబూబాబాద్ జిల్లా కమిటీ సభ్యులు గాదె కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్ళవద్దు

**లోతట్టు ప్రాంత ప్రజల అప్రమత్తంగా ఉండాలి**
**వైరా ఎస్సై పి.రామారావు**



**ఖమ్మం జిల్లా బ్యూరో/ఆగష్టు17 (తరంగాలు) ఖమ్మం :** వరద ప్రభావిత ప్రాంతాల వైపు ప్రజలు ఎవరు వెళ్ళద్దని వైరా ఎస్సై పి.రామారావు సూచించారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద పెరిగే ప్రమాదం పొంచి ఉంది ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైరా రిజర్వాయర్ నీటిమట్టం 20 అడుగులు చేరుకొని అలుగులు పారుతున్నదని,పర్యాటకు గాని,ప్రజలు గాని అలుగులు వద్దకు వెళ్ళవద్దని అలుగులు వద్ద పర్యాటకులను నిషేధించడం జరిగిందన్నారు.ఇది అందరూ గమనించాలని ,అదేవిధంగా స్నానల లక్ష్యం పురం వద్ద వైరా నది ఉధృతంగా ప్రవహిస్తుంది.ప్రజలు ఆ వరద ప్రభావ ప్రాంతాల వైపు ఎవరు వెళ్లొద్దని,పోలీసు వారి సూచనలు, సలహాలు తప్పనిసరిగా పాటించాలన్నారు.లోతట్టు ప్రాంతాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఆత్మహత్య చేసుకునే వ్యక్తిని కాపాడిన పోలీసులు..




**మహబూబాబాద్,ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు.17, తరంగాలు:** భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించగా సమాచారం అందుకున్న బ్లూ కోట్ పోలీసులు స్పందించి ప్రాణాలను కాపాడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మహబూబాబాద్ కు చెందిన బండి బాలు అనే వ్యక్తి కేసముద్రం రైల్వే స్టేషన్ లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు 100కు డయల్ చేసి చెప్పాడు. వెంటనే స్పందించిన బ్లూ కోట్ సిబ్బంది ఏండీ అలిమ్, రామకృష్ణ స్పందించి వెంటనే సంఘటన స్థలికి చేరుకొని రైలు పట్టాలపై పడుకున్న బాలును అక్కడనుంచి తీసుకువచ్చి పోలీస్ స్టేషన్కు తీసుకువెళ్లారు. అనంతరం అతని సమస్యను అడిగి తెలుసుకోగా, తన భార్య కాపురానికి రావడం లేదని చెప్పడంతో, ఆమెతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కారానికి తాము కృషి చేస్తామని చెప్పి బాలు సమీప బంధువుకు సమాచారం ఇచ్చి అతనికి అప్పగించారు.

# పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న రాజనాల శ్రీహరి



**ఖిలా వరంగల్, ఆగస్టు 17(తరంగాలు):** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో శ్రీను, ప్రసన్న, సతీష్, బాబు, రమేష్,బాబి,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హజ్రత్ జాన్పాక్ అమిరోద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు


**-సుదూరప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు**



**మహబూబాబాద్ ప్రతినిధి కేసముద్రం, ఆగస్టు17, తరంగాలు:** మహబుబాబాద్ జిల్లా కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని విలేజ్ కేసముద్రంలోనీ హజ్రత్ జాన్పాక్ అమీరోద్ధీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ దర్గా ముజాఫర్ లుగా షేక్ సర్వర్, షేక్ కరీంల ఆధ్వర్యంలో జరుగిన ఉర్సు ఉత్సవవాలు శనివారం రాత్రి: 8-00 గం. లకు ప్రారంభం కాగా, పూర్వం నుండి ఈ సందల్ (గంధం) వరంగల్ వారు మహ్మద్ ఆసీఫ్ అలీ, జిలానీ, ఫాఇమ్ము తీసుకోని వచ్చిన సందల్ (గంధం) ఉరేగింపుగా బయలుదేరి, రాత్రి 1-00 గం.కు దర్గాను చేరుకున్నాయి. అనంతరం ఖవాలి కార్యక్రమం నిర్వహించరు. ఆదివారం పెద్దఎత్తున ఉర్సు(ఫాతియా) ఉత్సవాలు నిర్వహించరు. అనంతరం మధ్యాహ్నం 12-30 గం.లకు మహఅన్నదాన కార్యక్రమం నిర్వహించరు. కాగా ఈ ఊర్సు ఉత్సవాలకు సూదురా ప్రాంతాలైన హైదరాబాద్, విజయవాడ, కరీంనగర్, ఆదిలాబాద్, జనగామ, ఆలేరు, నల్గొండ, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం నుండి వేలాది భక్తులు వచ్చి సందర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలోఉపాధ్యక్షులు ఎండీ యాకుబ్ పాషా 786, ఎస్కె యూసుఫ్, కార్యదర్శి ఎండీ హాజరోద్దీన్, కమిటీ సభ్యులు ఎండీ మహ్మద్, ఎండీ సైదులు, యాకుబ్ పాషా, ఎండీ మైబెల్లి, ముబారక్ అలీ, ఎస్కె జామలొద్దీన్ తదితరులు ఉన్నారు.ప్రతీ యేడు ఘనంగా దర్గా ఉత్సవాలు: అమిరోద్దీన్ బాబా దర్గా కమిటీ అధ్యక్షులు ఎండీ అమీర్ పాషా ప్రతీ యేడు కేసముద్రంలోనీ హజ్రత్ జాన్పాక్ అమీరోద్ధిన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాము. ఈఊర్సు ఉత్సవాలకు సూదురాప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కలు తీర్చుకుంటారు. ఈఉర్సు ఉత్సవవాలు (16 శనివారం) రాత్రి: 8-00 గం. లకు సందల్ (గంధం) ఉరేగింపు రాత్రి 1-00 గం.కు దర్గానుచేరుకుంటుంది. అనంతరం ఖవాలి కార్యక్రమం నిర్వహించబడును. అదేవిదంగా తేది 17 ఆదివారం ఉర్సు(ఫాతియా) నిర్వహించ బడును. మధ్యాహ్నం 12-30 గం.లకు మహఅన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

**-ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లల్లో నులి పురుగుల నివారణకు సహకరించాలి**
**-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు**



**వరంగల్ ప్రతినిధి,17 ఆగస్టు,తరంగాలు:** నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఆగస్ట్ 11 న ఆల్బెండజోల్ మాత్రలు పంపిణి చేయడం జరిగింది. అనివార్య కారణాలవల్ల మాత్రలు తీసుకొని బాల బాలికలకు మాప్ అప్ (తిరిగి ) డే ఆగస్ట్18,(సోమవారం)నేడు నిర్వహించనున్నట్లు తెలిపారు.దీనికి సంబంధించిన మైక్రో యాక్షన్ ప్లాన్ తయారు చేయడం జరిగిందన్నారు.వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా ఈ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఒక సంవత్సరము నుండి రెండు సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు సగం టాబ్లెట్ చూర్ణం చేసి నీళ్లలో వేసి త్రాగించాలని, రెండు సంవత్సరాల నుండి 19 సంవత్సరాల వయసు పిల్లలకు పూర్తి ట్యాబ్లెట్ నమిలి మింగాలని తెలిపారు.పిల్లలలో నులిపురుగులు శరీరంలో ఉండడం వలన వారి శారీరక, మానసిక అభివృద్ధి జరగకపోవడం, నీరసంగా, రక్తహీనతతో చదువుపై శ్రద్ధ లేకపోవడం మొదలగు లక్షణాలు కనిపిస్తాయన్నారు.కావున ప్రతి మండల స్థాయిలో ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు ,సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, టీచర్లు, సిడిపిఓలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు ,ఎన్జీవోస్ మొదలగువారు ప్రజలలో అవగాహన కల్పించి, జాతీయ నులిపురుగుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నులిపురుగుల పంపిణీ కేంద్రాలకు సంబంధించిన మెడిసిన్స్, ఐఇసి మెటీరియల్స్ పంపిణీ చేయడం జరిగింది. ఆల్బెండజోల్ టాబ్లెట్స్ తీసుకోవడం వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు ఒకవేళ సమస్యలు వచ్చినా కూడా వెంటనే సంబంధిత వైద్యాధికారి సిబ్బంది ద్వారా సేవలందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని డిఐఓ డాక్టర్ ప్రకాష్ పర్యవేక్షిస్తారు.ఈ కార్యక్రమంలో మండలాల వారీగా డిప్యూటీ డిఎంహెచ్వోలు,డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు , డాక్టర్ రవీందర్, డాక్టర్ మోహన్ సింగ్ ,డాక్టర్ అర్చన , డాక్టర్ విజయకుమార్, మానిటరింగ్ చేస్తారని తెలిపారు.

## మూసీ నదిని తలపిస్తున్న కల్వకుర్తి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు





**కల్వకుర్తి. ఆగస్టు 17. తరంగాలు ప్రతినిధి.** కల్వకుర్తి పట్టణంలోని డబల్ బెడ్రూంలో నివసించే ప్రజల ఘూత అంతా ఇంత కాదని గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ లు ఇస్తుంది అని ఎదురుచూసి ఎదురుచూసి ధర్నాలు రాస్తారోకోలు చేసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో డబల్ బెడ్ రూమ్ లు వచ్చాయని డబల్ బెడ్ రూమ్ నాసిరకం ఉండడంతో తమ సొంత ఖర్చులు పెట్టుకుంటూ మరమ్మతులు చేయించుకొని డబల్ బెడ్ రూంలో ఉంటున్నామని.ఇంక వానకాలం మొదలై మా బాధలు ఎక్కువ అయ్యాయని డబల్ బెడ్రూంలో నివసించే ప్రజలు బయటికి వెళ్లాలంటే చుట్టూ నీళ్ళుండి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు మీడియాతో మాట్లాడుతూ మూసీ నదిలా నీరు వచ్చి డబుల్ బెడ్ రూమ్ ల దగ్గర ఆగిందని దానివల్ల విష కీటకాలు. దోమలు అధికమై డబల్ బెడ్ రూమ్ లలో నివసించే ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్ కుమార్.ఈ విషయాన్ని పట్టించుకోని మురికినీళ్లునిలువఉండకుండా సిసి రోడ్లు. ఒక అండర్ గ్రౌండ్ డ్రైనేజ్. వీలైతే మొరం వేయించాలని డబల్ బెడ్ రూమ్ లో నివసించే ప్రజానీకం మీడియా మిత్రులకు కోరుకోవడం జరిగింది.

## కలకొండ గ్రామంలో మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆర్థిక సాయంచేస్తున్న చింతపల్లి వెంకటయ్య గౌడ్






**మాడుగుల్.ఆగస్టు 17 తరంగాలు ప్రతినిధి** మాడుగుల మండలం కలకొండ గ్రామంలో మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం చేస్తున్న కలకొండ గ్రామ ముద్దుబిడ్డ చింతపల్లి వెంకటయ్య గౌడ్ ఈరోజు కలకొండ గ్రామంలో 1.బూరెల రాములు సన్నాఫ్ పర్వతాలు గౌడ్ అలాగే 2.నకిరే కంటి శారద వైఫ్ ఆఫ్ యాదయ్య. ఇట్టి కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి ఓదార్చి అధైర్య పడవద్దని ధైర్యం చెప్పి తమ వంతు సహాయంగాఅట్టికుటుంబాలకుఒక్కోకుటుంబానికి 5000 చొప్పున రెండు కుటుంబాలకు 10000 రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. మృతుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ కలకొండ గ్రామంలో చనిపోయిన తమ కుటుంబ సభ్యులకు తమ సొంత డబ్బులతో చింతపల్లి వెంకటయ్య గౌడ్. ఆర్థిక సహాయం చేయడం జరిగిందని అతనికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కలకొండ గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు

## నీట మునిగిన పంట పొలాలకు నష్టపరిహారం చెల్లించాలి


**-బీజేపీ మండల అధ్యక్షులు ఊర నవీన్ రావు**



**గణపురం, ఆగస్టు 17 తరంగాలు:** అధిక వర్షాలతో గణపురం మండలంలో మోరంచవాగు ఉప్పొంగడంతో వాగు పరిసర ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను జిల్లా అధికార యంత్రాంగం పరిశీలించి తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షులు ఊర నవీన్ రావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతు జిల్లాలో మరి కొద్ది రోజులు అధిక వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారి చేసిందని, ఇప్పటికే మోరంచ వాగు ఉదృతంగా ప్రవహిస్తుండటంతో మండలంలోని సీతారాంపూర్ ధర్మరావుపేట, గణపురం, చెల్పూర్ శివారులో వరద తాకిడికి గురై పంట పొలాలు నీట మునిగాయన్నారు. గత రెండు రోజులుగా వరి పంట నీటిలో మునిగి ఉండటం, పొలాల్లో ఇసుకమేటలు వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున తక్షణమే ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి సర్వే చేపట్టి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. అదే వి ధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫలస్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆ పథకాన్ని అమలు చేస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు.

## మృతుని కుటుంబానికి అండగా ఉండి ఆర్థికసాయం చేసిన

**తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్.**



**మాడుగుల.ఆగస్టు 17 తరంగాలు ప్రతినిధి** రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం నర్సంపల్లి గ్రామపంచాయితీలో పోలె మొగులయ్య గత వారం క్రితం ప్రమాదవషాత్తు చనిపోవడం జరిగింది,ఇట్టి విషయాన్ని నర్సంపల్లి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ శ్రీ హనుమాన్ నాయక్ మరియు స్థానిక నాయకులు ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ జెడ్పిటిసి తలకొండపల్లి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ హనుమాన్ రాథోడ్ ఆధ్వర్యంలోమృతుని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ మనోధైర్యం చెప్పి ధైర్యంగా ఉండాలని కోరుతూ మూడు వేల రూపాయలు 50 కిలోల బియ్యం ఆర్థిక సహాయాన్ని గోపాల మిత్ర కార్యకర్త అయిన శ్రీ పోలే వెంకటయ్య చేతుల మీదుగా బాధితులకు అందించడం జరిగింది, ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు పోలే వెంకటయ్య గారు, కిన్నెర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



**నల్లబెల్లి, ఆగస్టు 17, తరంగాలు:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు కింద పడి నునావత్ వెంకన్న మృతి చెందాడు. ఈ సంఘటన నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామం మూలమలుపు వద్ద చోటు చేసుకుంది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం కు చెందిన నునావత్ వెంకన్న (55) తన బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న క్రమంలో ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామం మూల మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు కింద పడి చనిపోయాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి



**మహబూబాబాద్,ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు.17, తరంగాలు:** కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన ఈసంపల్లి ఉదయ్- స్వప్న వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,ఈకార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, ఇనుగుర్తి మండల పార్టీ అధ్యక్షుడు కూరెల్లి సతీష్,కూన భద్రాద్రి,బండారు మధు, మిట్టగడుపుల మహేందర్,శరత్, తదితరులు ఉన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో యూరియా సరఫరా చేయలేక చేతులు ఎత్తేసిన రేవంత్ సర్కార్



**మహబూబాబాద్, ప్రతినిధి, కేసముద్రం,ఆగస్టు.17, తరంగాలు:** కాంగ్రెస్ సర్కార్ లో రైతులకు ఇబ్బందులు రైతులకు అండగా బీఆర్ఎస్ యూరియా అందించేంత వరకు పోరాటం మార్కెట్ మాజీ చైర్మన్ నీలం దుర్గేష్ సువాసిని మాజీ జెడ్పిటిసి శ్రీనాథ్ రెడ్డి టౌన్ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్ ప్రధాన కార్యదర్శి కంటం శ్రీనివాస్, కాంగ్రెస్ సర్కారు లో రైతులకు ఇబ్బంది లు తప్పడం లేదని యూరియా లేక అన్నదాతలు విలవిలలాడుతున్నారని బిఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు గుగులోతు వీరు నాయక్ ధ్వజమెత్తారు ఆదివారం కేసముద్రం మున్సిపాలిటీలో రైతులకు అండగా రైతులకు యూరియాను వెంటనే నిబంధనలు లేకుండా అందించాలని డిమాండ్ కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా వీరు నాయక్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాల కేసీఆర్ పాలనలో రైతులు వ్యవసాయాన్ని పండగల చేసుకున్నారు అని కాంగ్రెస్ పాలనలో రైతులు యూరియా కోసం రోజుల తరబడి పడి కాపులు పడుతున్నారని అన్నారు సరిపడా యూరియా అందించేంతవరకు బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటాలు ఉధృతం చేస్తారని అన్నారు రైతన్నలకు యూరియా అందించని కాంగ్రెస్ సర్కార్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ధనసరి సింగిల్ విండో డైరెక్టర్ కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ సట్ల వెంకన్న కేసముద్రం విలేజ్ అధ్యక్షులు సట్ల శ్రీనివాస్ ఇంటికన్నె సర్పంచ్ రమేష్ యనమల ప్రభాకర్ , బానోత్ వెంకన్న నాయక్,కొమ్ము రాహుల్ సంకేపల్లి శ్రీనివాస్ రెడ్డి వల్లందాస్ రవి రడం శ్రీనివాస్ సాయి ఏకరాజ్యం మాజీ ఎంపీటీసీ చందు నాయక్ కడబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సోమవారం ప్రజావాణి రద్దు

### జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ లెనిన్ వత్సల్ టోప్పో



**మహబూబాబాద్, ప్రతినిధి, ఆగస్టు.17, తరంగాలు:** ఆగస్టు,18 సోమవారం ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఆదివారంనాడు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు, రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో రెడ్ అలర్ట్ ఉన్నందున జిల్లాస్థాయి అధికారులందరూ ప్రత్యేక అధికారులుగా నియమించబడి క్షేత్రస్థాయిలో ఉండటం వలన జిల్లా కేంద్రంలో ఎవరు ఉండరు, కావున ప్రజల సౌకర్యార్థం ఈ సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లుతెలిపారు,జిల్లాలోని ప్రజలు గమనించి ఈ సోమవారం ప్రజావాణి దరఖాస్తులతో కలెక్టరేట్ కార్యాలయమునకు రావద్దని ఆయన కోరారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం..




**మహబూబాబాద్, ప్రతినిధి,కేసముద్రం, ఆగస్టు. 17, తరంగాలు:** మండలంలోని కేసముద్రం స్టేషన్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ జాన్ స్కూల్ 2008-2009-2009-2010 పూర్వ విద్యార్థులు అందరు కలిసి సమావేశం నిర్వహించుకున్నారు. అనంతరం సెయింట్ జాన్ స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ శ్రావణ్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించుకుని పాఠశాలలో చదివిన తన స్నేహితుల మధ్య తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరిని ఒకరిని ఆప్యాయతంగా పలకరించుకొని వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎంతో క్రమశిక్షణతో మాకు బోధించిన విద్యను నేర్పించడం వల్లే ఈరోజు మేము ఒక స్థాయిలో ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు సుధీర్ రెడ్డి, సిహెచ్ శ్రీనివాస్, కొప్పుల శంకర్, కుమార్, లాల్ బహుదూర్, నాజియా, చైతన్య, దూరతి, రాకేష్ ,శ్రవణ్ దీప్తి, సాయి, స్వప్న సతీష్ శ్రీధర్ , కార్తీక్ , మావ్య ,తదితరులు పాల్గొన్నారు.

## జక్కిడి శివ చరణ్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం గణేష్ యాదవ్



**మహబూబాబాద్,ప్రతినిధి, కేసముద్రం, ఆగస్టు. 17, తరంగాలు:** శంషాబాద్ జిఎంఆర్ ఏరీనా లో జరిగిన తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ జక్కిడి శివ చరణ్ రెడ్డి మరియు దివ్య రెడ్డి గార్ల వివాహ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన యువజన కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం గణేష్ యాదవ్,ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట అఖిల్ కుమార్,యూత్ కాంగ్రెస్ నియోజవర్గ ఉపాధ్యక్షుడు హరి కృష్ణ,మండల ఉపాధ్యక్షుడు ఎండీ సమీర్, బానోత్ అభి,యశ్వంత్, తదితరులు ఉన్నారు.

## సింగూర్ ప్రాజెక్ట్ ను పరిశీలించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

### -జిల్లా కలెక్టర్ ప్రావీణ్య





**ఆగస్టు 17, తరంగాలు** సింగూర్ డ్యామ్ పైన సింగూర్ భద్రత పై జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య , ఇరిగేషన్ ఉన్నతాధికారుల తో సమీక్ష . సింగూర్ ప్రాజెక్టు కు ఎగువ ప్రాంతం నుండి వస్తున్న 31, 968 క్యూసెక్కుల వరద ను దృష్టిలో పెట్టుకొని డ్యామ్ దిగువ కు 43,634 క్యూసెక్కుల వరదను 5 గేట్ల ద్వారా వదులుతున్నట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహా గారికి వివరించిన ఇరిగేషన్ అధికారులు . సింగూర్ ప్రాజెక్టు భద్రత పై డ్యామ్ సేఫ్టీ కమిటీ ఇచ్చిన నిబంధనలను దృష్టిలో పెట్టుకొని 520 . 5 మీటర్ల వరకు నీటి నిల్వ ను యావరేజ్ గా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు .డ్యామ్ సేఫ్టీ పై ప్రత్యుమ్న్యాయ మార్గాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహా జిల్లా కలెక్టర్ పి . ప్రావీణ్య , ఇరిగేషన్ ఎస్ ఈ పొచ్చా మల్లు , రెవిన్యూ అధికారులు . ఇరిగేషన్ , పోలీస్ అధికారులతో చర్చించారు .

## అంగ రంగ వైభవంగా కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట

### పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి.




**తలకొండపల్లి,ఆగస్టు 17, తరంగాలు ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని మెదక్ పల్లి గ్రామంలో కసిరెడ్డి విజేందర్రెడ్డి కుటుంబం నిర్మించిన కోట మైసమ్మ దేవాలయ నిర్మాణం పూర్తి చేసుకొని కోట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట కళ్యాణం ఎంతో అంగ రంగ వైభవంగా సాగింది.ఈ కార్యక్రమానికి తలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరి ప్రభాకర్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట మైసమ్మ ఆశీస్సులు తలకొండపల్లి ప్రజలకుఎల్లప్పుడూఉండాలని ప్రజలందరూ ఆమె దయ వల్ల సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోట మైసమ్మ అమ్మవారిని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు వెంకట్ రామ్ రెడ్డి. అల్వాల్ రెడ్డి. నాయకులు తిరుపతి రెడ్డి. మండల కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ గౌడ్. కరుణాకర్ రెడ్డి. నరేందర్ గౌడ్. రాజు. వీరస్వామి తదితరులు పాల్గొన్నారు

## వైభవంగా అఖండ శివనామ సప్తహం



**పాపన్నపేట,ఆగస్టు 17, తరంగాలు** వైభవంగా ప్రారంభమైన అఖండ నమశ్శివాయ తాళ సప్తహం, కార్యక్రమం. మండల పరిధిలోని కుర్తివాడ గ్రామ మెయిన్ రోడ్డువద్ద శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ సన్నిధిలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల, మరియు భక్త బృందం, ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో తొమ్మిది రోజులపాటు 24 గంటలు నిరంతరాయంగా కొనసాగే "ఓం. నమశ్శివాయ అఖండ శివనామ సప్తః హ" కార్యక్రమం ఆదివారం ఉదయం11 గంటలకు వైభవంగా ప్రారంభమైంది ఆలయ అర్చకులు రమేష్ శర్మ,స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపారాధన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు ఇట్టి కార్యక్రమానికి రోజు వారిగా వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు, గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ,, శ్రావణమాసం అఖండ శివనామ తాళ సప్తహ కార్యక్రమంలో పాల్గొని దైవ నామస్మరణ చేయడం వల్లన అత్యాత్మిక చింతన తొలగిపోయి మానసిక ప్రశాంతత ఉంటుందని పేర్కొన్నారు దైవనామస్మరణ చేస్తే భగవంతునికి ప్రీతి పాత్రలు అవుతారన్నారు


## కోటగుళ్లలో జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యుల పూజలు





**గణపురం ఆగస్టు 17,తరంగాలు:** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ లో ఆదివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సతీమణి వారి కుటుంబ సభ్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని కోట గుళ్ళు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని ఆహ్వానించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు నాగరాజు వారికి ఆశీర్వచనాలు తీర్థప్రసాదాలను అందజేసి శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## జి జి ఆర్ పల్లి లో వైద్య శిబిరం



**చెన్నారావుపేట ఆగస్టు 17 (తరంగాలు)** చెన్నారావుపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో. గురిజాల ఉపకేంద్రం పరిధిలోని గుర్రాలగండి రాజపల్లిలోఆదివారం వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ సరోజ తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్యారోగ్య శాఖధికారి సూచన మేరకు వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్బంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. జ్వరపిడితుల నుండి రక్త నమూనాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సహజ, హెల్త్ సూపర్ వైజర్ రామేల్, వైద్య సిబ్బంది వెంకటరెడ్డి, సురేందర్, సరియ, రాజకుమారి, రజిని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి నీట మునిగిన పత్తి చేను



**ఆగస్టు 17, తరంగాలు** మెదక్ జిల్లా టేక్మల్ మండల కేంద్రంలో నీ అకాల వర్షానికి గుండు వాగు ప్రవాహానికి పత్తి చేను మునిగిపోవడంతో కోయిలకొండ రైతు మధు మాట్లాడుతూ పత్తి చేను మునిగిపోవడంతో భారీ నష్టం జరిగిందని దానికి పరిహారం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని తెలిపారు

# నేడు సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి



**హైదరాబాద్, ఆగస్టు 17 ఆగస్టు 17 (తరంగాలు)**


బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతిని బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నారు. 17వ శతాబ్దంలోనే సొంత సైన్యంతో గోల్కొండ రాజులపై తిరుగుబాటు చేయడంతోపాటు, ఖిలాషాపూర్ కేంద్రంగా చేసుకుని రాజ్యపాలన సాగించారు. ఈ మేరకు ఆయన 375వ జయంతి వేడుకలను బీసీ సంక్షేమశాఖ నేతృత్వంలో రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. అదేవిధంగా ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం విగ్రహ ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పరిశీలించారు.






## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర నేటి బహుజనులందరికి స్ఫూర్తిదాయకం


**కల్లేపు ప్రణీత్ గౌడ్- లా విద్యార్థి**





**చెన్నారావుపేట ఆగస్టు 17 (తరంగాలు)**

మొదటి తెలుగు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర నేటి బహుజనులందరికీ స్ఫూర్తిదాయకమని కల్లేపు ప్రణీత్ గౌడ్ అన్నారు. వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, కోనాపురం గ్రామానికి చెందిన కల్లేపు ప్రణీత్ గౌడ్ బహుజనులందరికీ బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం అధికారికంగా నిర్వహించే పాపన్న జయంతిసందర్భంగాబహుజనులందరూ ఆయన చరిత్రను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ:మొట్టమొదటి తెలుగు బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, పూర్వం వరంగల్ జిల్లా ప్రస్తుత జనగామ జిల్లా, రఘునాథపల్లి మండలం, ఖిలాషాపూర్ గ్రామంలో 18 ఆగస్టు 1650లో జన్మించిన పాపన్న. తన చిన్నతనంలోనే తండ్రి ధర్మన్న గౌడ్ మరణించగా తల్లి సర్వమ్మ కోరిక మేరకుకల్లుగీతవృత్తినికొనసాగిస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయాలను గమనించేవాడు. తురుష్కసైనికులు. రైతుల నుండి భూమి పనులు, కల్లుగీత కార్మికుల నుండి చెట్టు పన్నులను వసూలుచేస్తూప్రజలను పీడిస్తున్న సమయంలో దోపిడి వ్యవస్థకు కల్లు గీసే కత్తిని ఖడ్గంగా మార్చి తురుష్క సైనికులపై తిరగబడి దోపిడీ చేసిన ధనాన్ని తిరిగి ప్రజలకు పంచిన ఘనత ఆయనదని, వివిధ కులాల మిత్రులతో కలిసి గెరిల్ల సైన్యాన్ని స్థాపించి తురుష్క, భూస్వాముల, జమీందారులు, జాగిదారులను ఎదిరించి వారి సంపదను పేద ప్రజలకు పంచుతూ, అభివృద్ధి పనులు చేస్తూ, బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేశాడని, పోరాటాలు చేసి గోల్కొండ కోటపై బహుజన జండా ఎగరవేసిన తొలి వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. కుల మత వర్గ బేధాలు లేకుండా బహుజనులంతా ఏకమై తమ హక్కుల కోసం పోరాడి నాయకుడిగా ఎదగాలని కోరిన వ్యక్తి పాపన్న గౌడ్. నేడు ఆయన చరిత్రను స్మరిస్తూ భవిష్యత్ తరాలకు ఆయన చరిత్రను తెలిపి, ఆయనను ఆదర్శంగా తీసుకొని బహుజనులంతా రాజ్యాధికారం కోసం పోరాడాలని కోరారు.




## ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం..



**మాజీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్.**

**చెన్నారావుపేట ఆగస్టు 17 (తరంగాలు)**

ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని మాజీ మండల అధ్యక్షుడు భూక్య గూపాల్ నాయక్అన్నారు..బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుని పంపిణీ చేసే కార్యక్రమంలోపాల్గొన్నారు. చెన్నారావుపేట. మండలంలోని అక్కల్ చెడ గ్రామంలో ఆదివారం దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుని గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ ఆధ్వర్యంలో చెక్కుని మాజీ మండలఅధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ మాజీ సర్పంచ్ తూటి పావని రమేష్ లు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి పంపిణీ చేసారు.. అక్కల్ చెడ గ్రామానికి చెందిన బాధవత్ రవి కుమార్ అనారోగ్యానికి గురై ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందారు.. ఈ మేరకు బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో బాధితునికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు 16 వేల రూపాయల చెక్కు ని అందించారు..ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బానోతు వీరన్న నాయక్ గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లావుడ్యా వెంకన్న నాయకులు భూక్య సురేష్ బాధవత్ పెద్ద వీరు ముత్యం భద్రయ్య తేజవత్ భద్రు మాజీ ఉప సర్పంచ్ బాధవత్ రవితేజ మాజీ వార్డు సభ్యుడు బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ఆకుల అశోక్ ఇస్లావత్ భద్రు రాంసింగ్ తేజవత్ శివ మైనారిటీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఫయాజ్ బాధవత్ సురేష్ మూడు వీరు భూక్య భద్రు బాధవత్ రవి వెంకన్న వీరు దేవా బాణోత్ శ్రీను బాధవత్ ప్రసాద్ లావుడ్యారంజిత్ బాధవత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు..

## కారంపూడిలో ఏపీయూడబ్ల్యూజే 69వ వ్యవస్థాపక దినోత్సవం

**కారంపూడి. ఆగస్టు 17 (తరంగాలు)**

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ 69వ వ్యవస్థాపక దినోత్సవం పల్నాడు జిల్లా ఏపీయూడబ్ల్యూజే నాయకత్వం ఆధ్వర్యంలో నరసరావుపేట పల్నాడు జిల్లా అధ్యక్షులు పిలుపుమేరకు కారంపూడి శాఖ ర్యాలీ నిర్వహించడం జరిగింది. స్వర్గీయ మానికొండ చలపతిరావు ఆధ్వర్యంలో (1957) ఏర్పాటైన ఏపీయూడబ్ల్యూజే యూనియన్ , ఆగస్ట్ 17వ తేదీకి 69 వ వ్యవస్థాపక దినోత్సవం జరుపుకోనున్నది. ఆరు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న, యూనియన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని, కారంపూడిఏపీయూడబ్ల్యూజే)ఆధ్వర్య లో చెక్ పోస్ట్ సెంటర్ నుండి నాగులేరు బ్రిడ్జి వాగు ర్యాలీ విజయవంతం




జరిగింది. అధ్యక్షుడు బాణావత్ రాజేష్ నాయక్ మరియు కారంపూడి. మీడియా మిత్రులు వెంకటప్పయ్య .సురేష్ .వీరేంద్ర జానీ భాష .అల్లి కరుణాకరు. మబ్బు జానీ భాష .బోరుశెట్టి రామారావు. కోటేశ్వరరావు .సముద్రాల. సాయి సూరే వెంకట నాగేశ్వరరావు జి మణికుమార్ అనీలు రవితేజ. వర ప్రసాద్. అల్లావుద్దీన్. శీను నాయక్ .శ్రీనివాస్. వెంకటేశు మిరియాల శీను. వెంకట్రావు కారంపూడి మండల కేంద్రంలో ఉన్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులలు పాల్గొనటం జరిగింది.

# బిజినెస్

## గృహ రుణాలపై ఎస్బీఐ బాదుడు

**-వడ్డీ రేట్ల పెంపు**
**-కొత్త ఖాతాదారులపై పావు శాతం భారం**




: దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) గృహ రుణాలపై వడ్డీ రేట్లను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే నూతన రుణ గ్రహీతలపై మాత్రమే 25 బేసిస్ పాయింట్లు (పావు శాతం) పెంచుతున్నట్లు వెల్లడించింది. సవరించిన వడ్డీరేట్లు ఆగస్టు 1 నుంచే అమల్లోకి వచ్చినట్టు వెల్లడించింది. ముఖ్యంగా సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న ఖాతాదారులపై ఇది ఎక్కువ ప్రభావం చూపనుందని తెలిపింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా వడ్డీ రేట్లను పెంచింది. ఇతర బ్యాంక్‌లు కూడా ఇదే బాటలో నిర్ణయం తీసుకొవచ్చని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాల వ్యవధిని బట్టి ఉండనుంది. ఇప్పటివరకు ఎస్బీఐ గృహ రుణ రేట్లు 7.50 శాతం నుంచి 8.45శాతంగా ఉండగా.. తాజా పెంపునతో ఇది 7.50శాతం నుంచి 8.70 శాతానికి పెరిగింది. సిబిల్ స్కోరు తక్కువగా ఉండేవారికి ఇకపై అధిక వడ్డీ రేట్లను చెలించాల్సి ఉంటుంది."సిబిల్ స్కోరు, ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు ఆధారంగా విధించే వడ్డీరేట్లలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పులు చేసింది. గృహ రుణాలపై మార్జిన్ పెంచుకునేందుకే వడ్డీరేట్లను పెంచాం. ఈ పెంపు కేవలం కొత్త కస్టమర్లకు మాత్రమే. ఇప్పటికే తీసుకున్న గృహరుణాలకు ఇది వర్తించదు" అని ఎస్బీఐ వర్గాలు స్పష్టం చేశాయి. యూనియన్ బ్యాంక్ రుణ రేట్లు గతంలో 7.35శాతం ప్రారంభం కాగా.. ఇప్పుడు దాన్ని 10 బేసిస్ పాయింట్లు పెంచి 7.45 శాతానికి చేర్చింది. ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపో రేటును 5.5 శాతానికి తగ్గించింది. అయినప్పటికీ బ్యాంక్‌లు వడ్డీ రేట్లను పెంచడం ఆర్థిక వ్యవస్థలో బలహీనత సంకేతాలను స్పష్టం చేస్తోన్నాయి.

బ్యాంక్ పేరు రుణ రేటు(శాతం) ఎస్బీఐ 7.50-8.45 యూనియన్ బ్యాంక్ 7.45 హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 7.90
యాక్సిస్ బ్యాంక్ 8.35 నెలకు రూ.450 అదనం

## ఆపిల్ లవర్స్ గెట్ రెడీ..
## ఆ డేట్‌ను ఫిక్స్ చేసి పెట్టుకోండి.. ఐఫోన్ 17 సిరీస్ రాబోతుంది!

మీరు కొత్త ఐఫోన్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటే, మీ క్యాలెండర్‌లో ఈ తేదీలను టిక్ చేసి పెట్టుకోవడానికి ఇదే సరైన సమయం. ఎందుకంటే.. తాగా లీక్స్ ప్రకారం.. ఐఫోన్ 17 సిరీస్ లాంచ్ తేదీని ఎప్పటిలాగే సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈసారి కూడా ఆపిల్ సెప్టెంబర్ నెల అంతా తన ఐఫోన్‌లు, వాచ్‌లు, ఇతర పరికరాలను లాంచ్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. బ్లూమ్‌బెర్గ్‌కు చెందిన మార్క్ గుర్మాన్, ఫోర్బ్స్ నివేదికల ప్రకారం ఆపిల్ సెప్టెంబర్ 9న ఐఫోన్ 17 సిరీస్‌ను లాంచ్ చేయనుందని సమాచారం. ఈ ఈవెంట్‌లో అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే, ఐఫోన్ 16 ప్లస్ స్థానంలో వచ్చే కొత్త ఐఫోన్ 17 ఎయిర్. మిగిలిన




మోడళ్లలో కంపెనీ స్పెక్స్ అప్‌గ్రేడ్‌లను తీసుకువస్తుంది.

**నివేదికల ప్రకారం.. ఐఫోన్ 17 సిరీస్ లాంచ్ షెడ్యూల్**

**సెప్టెంబర్ 9:** ఐఫోన్ 17 సిరీస్, కొత్త ఆపిల్ వాచ్, ఇతర ఉత్పత్తులు లాంచ్ కానున్నాయి

సెప్టెంబర్ 12: ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో కోసం ప్రీ-బుకింగ్ ప్రారంభమవుతాయి

**సెప్టెంబర్ 19:** ఐఫోన్ 17, ఐఫోన్ 17 ఎయిర్, ఐఫోన్ 17 ప్రో, ఐఫోన్ 17 ప్రో మాక్స్ అమ్మకాలు స్టార్ట్ అవుతాయి

**ఐఫోన్ 17 ప్రో లాంచ్ డేట్, ధర వివరాలు..**

సెప్టెంబర్ 9న ఐఫోన్ 17 సిరీస్ లాంచ్ అవ్వనున్నట్లు తెలుస్తోంది.ఐఫోన్ 17 ప్రో కూడా బ్లాక్, యాష్, వైట్, ఆరెంజ్, బ్రైట్ బ్లూ వంటి 5 వేర్వేరు కలర్స్‌లో రానుంది. ధరల విషయానికొస్తే ఈ ఐఫోన్ 17 ప్రో రూ. 1,45,900 ప్రారంభ ధరకు లాంచ్ కానున్నట్లు తెలుస్తోంది.

## మరింత తగ్గిన బంగారం ధర..

మన దేశంలో బంగారానికి డిమాండ్ ఎప్పుడూ ఎక్కువే. ముఖ్యంగా ఆడవాళ్లకు పుత్తడి మీదున్న మక్కువ చాలా ఎక్కువ. ఆడ, మగ అనే కాదు.. బంగారం ధరించేందుకు అందరూ ఇష్టపడతారు. ఒంటి నిండా నగలు వేసుకోవాలని ఆశపడుతుంటారు. కానీ, ఇటీవలి కాలంలో గోల్డ్ ధరలు భారీగా పెరిగాయి. మార్కెట్ ఒడిదుడుకులు, బంగారంపై ప్రజల్లో ఉన్న డిమాండ్ మేరకు పసిడి ధరలు ఎప్పటికప్పుడూ మారుతూనే ఉంటాయి. గత కొంతకాలంగా బంగారం ధరల్లో విచిత్రమైన మార్పులు కనిపిస్తున్నాయి. గడిచిన కొన్ని రోజులుగా ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన గోల్డ్ రేట్స్ ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం మన దేశంలో బంగారం ధర ఎలా ఉందంటే.

హైదరాబాద్ సహా దేశంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో 17-8-2025 బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

భారతదేశం - 24 క్యారెట్ల బంగారం ధర 10గ్రాములు రూ.1,00,960లు కాగా, 22 క్యారెట్ల



బంగారం ధర 10 గ్రాములు రూ. 92,540లుగా ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,330లుగా ఉంది. అదే 22 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ.92,900 లుగా ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,180, 22 క్యారెట్ల ధర రూ.92,750 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,01,180 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.92,750 గా ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,01,180, 22 క్యారెట్ల ధర రూ.92,750 గా ఉంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం పదిగ్రాముల ధర రూ.1,01,180 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.92,750 లుగా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,01,180, 22 క్యారెట్ల ధర రూ.92,750 లుగా ఉంది.

# స్పోర్ట్స్

## సూర్య, బుమ్రా రెడీ.. టాపార్డర్‌లో వీళ్లకు చోటు దక్కేనా..?

ఆసియా కప్ పోటీలకు భారత స్క్వాడ్ ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఓపెనింగ్ నుంచి మిడిలార్డర్, బౌలింగ్ యూనిట్ వరకూ ఎవరిని తీసుకోవాలి? అనే అంశంపై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌లు మల్లగుల్లాలు పడుతున్నారు. ఈ మెగా టోర్నీకి సమతూకంతో కూడిన బృందం ఎంపిక ఇరువురికి సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో టీ20 సారథి సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ అయ్యాడు. మరోవైపు.. ఇంగ్లండ్ పర్యటనలో మూడే టెస్టులే ఆడిన ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా సైతం తాను అందుబాటులో ఉన్నానని సెలెక్టర్లకు సమాచారమిచ్చాడు. దాంతో, ఆసియా కప్ స్క్వాడ్‌లో ఈ ఇద్దరూ ఉండడం ఖాయమనిపిస్తోంది.

ఆసియా కప్ సమీపిస్తున్నందున భారత సెలెక్టర్లు ఆగస్టు 19న ముంబైలో సమావేశం కానున్నారు. ఈ మీటింగ్‌లో స్క్వాడ్ ఎంపికపై స్పష్టత రానుంది. ఆసియా కప్ సెలెక్షన్స్‌కు తాను అందుబాటులో ఉన్నానని బుమ్రా సెలెక్టర్లకు చెప్పాడు. స్క్వాడ్‌లో చోటు కోసం ఆటగాళ్ల మధ్య గట్టి పోటీ ఉంది.

**జస్ప్రీత్ బుమ్రా**

అయితే.. బృందంలో ఎవరెవరు ఉండాలి? అనే విషయమై సెలెక్టర్లు వచ్చే వారం సమావేశంలో నిర్ణయం తీసుకుంటారు అని బీసీసీఐ విశ్వసనీయ




వర్గాలు తెలిపాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది పొట్టి ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ టోర్నీని టీ20 ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నారు. ఈ మెగా ఈవెంట్లో చిరకాల ప్రత్యర్థులు సెప్టెంబర్ 14న దుబాయ్ వేదికగా తలపడనున్నాయి.

**కెప్టెన్‌గా సూర్య..**

పొట్టి ఫార్మాట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు వీడ్కోలు పలకడంతో టాపార్డర్ కోసం గట్టి పోటీ నెలకొంది. ముఖ్యంగా ఓపెనర్ స్థానం కోసం యశస్వీ జైస్వాల్, సంజూ శాంసన్, శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మలు బరిలో ఉన్నారు. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుతంగా రాణించిన గిల్‌కే కెప్టెన్సీ అందించాలనే వాదనలు వినిపిస్తున్నాయి.అయితే.. స్పోర్ట్స్ హెర్నియా గాయం నుంచి కోలుకున్న సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ కావడంతో అతడికే సారథ్యం అప్పగించే అవకాశాలున్నాయి. ఎన్‌సీఏలో రాటుదేలుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, ఫిట్‌నెస్ చాటుకోవాల్సి ఉంది. రెండో వికెట్ కీపర్ కోసం ఇషాన్ కిషన్, జితేశ్ శర్మలు పోటీ పడుతున్నారు. ఈ ఇద్దరిలో ఒకరిని సంజూకు బ్యాకప్‌గా సెలెక్ట్ చేసే అవకాశముంది.

## బాబర్, రిజ్వాన్‌పై వేటు.. పాక్ సారథిగా సల్మాన్ అఘా..!


ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న పాకిస్థాన్ స్టార్ ఆటగాళ్లపై వేటు పడింది. ఆసియాకప్ కోసం ఆ దేశ క్రికెట్ బోర్డు ప్రకటించిన స్క్వాడ్‌లో మాజీ సారథులు బాబర్ ఆజం , మహ్మద్ రిజ్వాన్ లకు చోటు దక్కలేదు. మెగా టోర్నీకి సమయం దగ్గరపడుతుండడంతో ఆదివారం సెలెక్టర్లు 17 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. టీ20 ఫార్మాట్‌లో జరుగబోయే ఈ ఎడిషన్‌కు సల్మాన్ అఘా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.సీనియర్లు బాబర్, రిజ్వాన్ బదులు ఫఖర్ జమాన్ సయీం ఆయూబ్, సహిబ్జదా ఫర్హాన్‌లు టాపార్డర్‌లో ఆడనున్నారు. ఇక పేస్ బౌలింగ్ యూనిట్‌ను షాహీన్ అఫ్రిది, హ్యారిస్ రవుఫ్, స్పిన్ దళానికి మహమ్మద్ నవాజ్ నడిపించనున్నారు. ఆసియా కప్ కంటే ముందు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ గడ్డపై జరుగబోయే ముక్కోణపు సిరీస్‌లో




పాక్ ఇదే స్క్వాడ్‌తో బరిలోకి దిగనుంది. ఆగస్టు 29న మొదలయ్యే ఈ టోర్నీలో ఆతిథ్య యూఏఈ, పాక్‌తో పాటు అఫ్గనిస్థాన్ పోటీపడనుంది.యూఏఈ గడ్డ మీద సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీలో చిరకాల ప్రత్యర్థులు సెప్టెంబర్ 14న దుబాయ్ వేదికగా తలపడనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌ను దృష్టిలో ఉంచుకొని స్క్వాడ్‌లో భారీ మార్పులు చేసింది పాకిస్థాన్ బోర్డు. టీ20 వరల్డ్ కప్ నుంచి వరుసగా విఫలమవుతున్న సీనియర్లు బాబర్ ఆజం, మహమ్మద్ రిజ్వాన్‌లను పక్కన పెట్టేసింది. నిలకడగా రాణిస్తున్న కుర్రాళ్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆసియా కప్ స్క్వాడ్‌లోకి తీసుకుంది.

**పాకిస్థాన్ స్క్వాడ్ :** సహిబ్జదా ఫర్హాన్, సయీం ఆయూబ్, ఫఖర్ జమాన్, మొహమ్మద్ హ్యారీస్ (వికెట్ కీపర్), సల్మాన్ అఘా (కెప్టెన్), హసన్ నవాజ్, ఖుష్‌దిల్ షా, ఫహీం అష్రఫ్, హుస్సేన్ తలాట్, మహమ్మద్ నవాజ్, అబ్రార్ అహ్మద్, సూఫీయాన్ మకీం, షాహీన్ అఫ్రీది, హారిస్ రవుఫ్, హసన్ అలీ, మహమ్మద్ వసీం, సల్మాన్ మిర్జా.

## ఐపీఎల్‌లో ఇక అలా కుదరదు..
## షార్ట్ రన్‌పై బీసీసీఐ కీలక నిర్ణయం..!




ఐపీఎల్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌లో పలు మార్పులకు శ్రీకారం చుడుతోంది భారత క్రికెట్ నియంత్రణ మండలి. తీవ్రంగా గాయపడిన ఆటగాళ్లు మరితంగా గాయపడకుండా చూడాలనే ఉద్దేశంతో రీప్లేస్‌మెంట్ ప్లేయర్‌ను అనుమతించేందుకు బోర్డు పచ్చజెండా ఊపింది. అంతేకాదు షార్ట్ రన్ పై, రిటైర్డ్ హర్ట్ అయిన బ్యాటర్లపై, వన్డే మ్యాచ్‌లో రెండు బంతుల వినియోగంపై కూడా కీలక నిర్ణయం తీసుకుంది బీసీసీఐ.మామూలుగా టీ20ల్లో.. ముఖ్యంగా ఐపీఎల్‌లో వికెట్లు పడుతుంటే ప్రధాన బ్యాటర్లు ఓవర్ చివరి బంతికి చివర సింగిల్ తీసేందుకు ప్రయత్నిస్తారు. టెయిలెండర్లు వికెట్ కాచుకోలేరు, బౌండరీలు బాదలేరు కాబట్టి వాళ్ల బదులు స్ట్రయిక్ తీసుకోవాలని కష్టమైనా సరే రెండు రన్స్ తీస్తుంటారు. ఈ క్రమంలో కావాలనే కొందరు నాన్ స్ట్రయికింగ్ క్రీజులో బ్యాటు పూర్తిగా పెట్టరు. దీన్నే షార్ట్ రన్‌గా పరిగణిస్తారు. ఇకపై షార్ట్ రన్ తీసి బ్యాటింగ్ చేద్దామనుకుంటే కుదరదని బీసీసీఐ తేల్చి చెప్పింది. బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగానే షార్ట్ రన్ తీస్తే.. స్ట్రయికింగ్‌లో ఎవరు ఉండాలో ఫీల్డింగ్ జట్టు కెప్టెన్ నిర్ణయించేలా కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది.మామూలుగా టీ20ల్లో.. ముఖ్యంగా ఐపీఎల్‌లో వికెట్లు పడుతుంటే ప్రధాన బ్యాటర్లు ఓవర్ చివరి బంతికి చివర సింగిల్ తీసేందుకు ప్రయత్నిస్తారు. టెయిలెండర్లు వికెట్ కాచుకోలేరు, బౌండరీలు బాదలేరు కాబట్టి వాళ్ల బదులు స్ట్రయిక్ తీసుకోవాలని కష్టమైనా సరే రెండు రన్స్ తీస్తుంటారు. ఈ క్రమంలో కావాలనే కొందరు నాన్ స్ట్రయికింగ్ క్రీజులో బ్యాటు పూర్తిగా పెట్టరు. దీన్నే షార్ట్ రన్‌గా పరిగణిస్తారు. ఇకపై షార్ట్ రన్ తీసి బ్యాటింగ్ చేద్దామనుకుంటే కుదరదని బీసీసీఐ తేల్చి చెప్పింది. బ్యాటర్లు ఉద్దేశపూర్వకంగానే షార్ట్ రన్ తీస్తే.. స్ట్రయికింగ్‌లో ఎవరు ఉండాలో ఫీల్డింగ్ జట్టు కెప్టెన్ నిర్ణయించేలా కొత్త నిబంధనను ప్రవేశపెట్టింది.

## అందంతో పిచ్చెక్కిస్తున్న అనసూయ



# నిధి అగర్వాల్ బర్త్ డే స్పెషల్..

## క్యూరియాసిటీ పెంచుతున్న రెండు పోస్టర్లు




ఇటీవలే హరిహరవీరమల్లు సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది నిధి అగర్వాల్. ఓ వైపు అందాలు ఆరబోస్తూనే.. మరోవైపు తనలోని యాక్షన్ అవతార్‌ను కూడా చూపించింది. ప్రస్తుతం ప్రభాస్‌తో కలిసి రాజాసాబ్ సినిమాలో నటిస్తోన్న ఈ భామ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా అభిమానులు, ఫాలోవర్లు నిధి అగర్వాల్‌కు బర్త్ డే విషెస్ తెలియజేస్తున్నారు. రాజాసాబ్ మేకర్స్ నిధి అగర్వాల్‌కు బర్త్ డే విషెస్ తెలియజేస్తూ క్యారెక్టర్ పోస్టర్‌ను షేర్ చేశారు.మరోవైపు జ్యోతి క్రియేషన్స్ మైదాన్ ప్రొడక్షన్ ప్రాజెక్ట్‌లో నిధి అగర్వాల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. 'ఆమె కండ్లు రహస్యాలను దాచిపెడతాయి. ఆమె చిల్‌ను తీసుకొస్తుంది. కానీ ఆమె ముఖం కనిపించకుండా ఉంది.. ' అంటూ డార్క్ షేడ్స్‌లో నిధి అగర్వాల్ చూస్తున్న స్టిల్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. నిఖిల్ కార్తీక్ డైరెక్టర్‌గా డెబ్యూ ఇస్తున్న ఈ చిత్రాన్ని పుప్పల అప్పల రాజు నిర్మిస్తున్నారు. ఫీ మేల్ సెంట్రిక్ సినిమాగా వస్తున్న ఈ చిత్రం టైటిల్‌ను దసరా కానుకగా అనౌన్స్ చేయనున్నారు.

## ఓజీ మాయలో కన్మణి

పవన్‌కల్యాణ్ 'ఓజీ' సినిమా కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్న విషయం తెలిసిందే. పియాంక అరుల్ మోహన్ ఇందులో కథానాయిక. వచ్చే నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ విషయంలో మేకర్స్ వేగం పెంచారు. అందులో భాగంగా కథానాయిక ప్రియాంక అరుల్ మోహన్ ఫస్ట్‌లుక్‌ను శనివారం విడుదల చేశారు. ఇందులో ఆమె కన్మణిగా కనిపించనున్నారు. ఇప్పటివరకూ విడుదలైన ప్రచార చిత్రాలన్నీ 'ఓజీ'ని ఓ భారీ యాక్షన్ మూవీగా ఆవిష్కరించాయి.తాజాగా విడుదలైన ప్రియాంక ఫస్ట్‌లుక్ మాత్రం అందుకు భిన్నంగా ద 'ఓజీ'ని ఓ కలర్‌ఫుల్ ప్రేమకథగా ప్రజెంట్ చేస్తున్నది. సుజీత్ మార్క్ యాక్షన్ విస్ఫోటనంతోపాటు లోతైన భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉంటాయని ప్రియాంక లుక్ చెబుతున్నది.మరోవైపు ఈ సినిమా నుంచి రెండో గీతాన్ని విడుదల చేసేందుకు నిర్మాత సన్నాహాలు చేస్తున్నారు. ఇమ్రాన్ హష్మి, అర్జున్ దాస్, ప్రకాశ్‌రాజ్, శ్రియారెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవికె.చంద్రన్, మనోజ్ పరమహంస, సంగీతం: తమన్, నిర్మాత: డి.వి.వి.దానయ్య, నిర్మాణం: డి.వి.వి. ఎంటైర్టైన్మెంట్స్.






## స్టాలిన్' రీ రిలీజ్..

### మెగా అభిమానులకు చిరు స్పెషల్ వీడియో

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి హీరోగా తమిళ దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన సూపర్ హిట్ చిత్రం స్టాలిన్. చిరంజీవి సొంత బ్యానర్ అయిన అంజన ప్రోడక్షన్ బ్యానర్‌లో ఈ సినిమా విడుదల కాగా.. 2006లో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి విజయం సాధించింది. అయితే తాజాగా ఈ సినిమాను 19 ఏండ్ల తర్వాత మళ్లీ రీ రిలీజ్ చేయబోతున్నారు మేకర్స్. ఆగష్టు 22న మెగాస్టార్ బర్త్‌డే సందర్భంగా ఈ మూవీని రీ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా మెగా అభిమానులను ఉద్దేశించి చిరు ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నాడు.'స్టాలిన్' చిత్రం విడుదలై దాదాపు రెండు దశాబ్దాలు కావోస్తుంది. ఇన్ని ఏండ్ల తర్వాత తిరిగి మళ్లీ నా పుట్టినరోజున ఈసినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర నిర్మాత నా తమ్ముడు నాగబాబు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. ఎందుకంటే ఒక మంచి సందేశాన్ని సమాజానికి అందించింది. ఒక వీర జవాన్‌గా దేశ సరిహద్దుల వద్ద ఉన్న శత్రువులతో పోరాడడం కాదు. దేశం లోపల ఉన్నశత్రువులతో యుద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుసుకుని ఈ సమాజంలో అంతర్యుద్ధం చేయడానికి ఒక సామజిక సృహ కలిగిన పౌరుడిగా మారతాడు ఈ చిత్రంలోని స్టాలిన్. ఈ సమాజాంలో తనవలన మేలు పొందిన ప్రజలు తనకు కృతజ్ఞతలు చెప్పడం కాకుండా అలాంటి మంచి పనే ముగ్గురికి చేసి.. ఆ ముగ్గురిని మరో ముగ్గురితో చేయమని చెప్పడం ఈ సినిమాలో చాలా బాగా చెప్పబడింది. ఈతరం యువకులకు బాధ్యత కూడా ఉండాల్సిన అవసరం ఉందని చెప్పిన చిత్రమిది. అలాగే ఈ సినిమాలో నటించిన నటులు ఖుష్బు, త్రిషలకి అలాగే ఇతర సాంకేతిక బృందంకి.. సంగీత దర్శకుడు మణిశర్మకి, దర్శకుడు మురుగదాస్‌కి నిర్మాత నా తమ్ముడు నాగబాబుకి నా హృదయపూర్వక అభినందనలు. ఈ చిత్రం మిమ్మల్ని మళ్లీ ఎంటర్‌టైన్ చేస్తుందని నమ్ముతున్నాను అంటూ చిరు చెప్పుకోచ్చాడు.





## రూటు మార్చి ఒకే లైన్‌లో..

## శివ నిర్వాణ, రవితేజ క్రేజీ కాంబో ఆన్ ది వే..!



టాలీవుడ్‌లో ఉన్న టాలెంటెడ్ డైరెక్టర్ల జాబితాలో ముందు వరుసలో ఉంటాడు శివ నిర్వాణ. కథను నమ్మి సినిమా చేసే అతికొద్ది మంది దర్శకుల్లో ఒకడు. చివరగా విజయ్ దేవరకొండతో ఖుషి సినిమా చేశాడు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం అందుకోలేకపోయినా.. మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీ తర్వాత కొత్త ప్రాజెక్ట్ ఏం ప్రకటించలేదు శివ నిర్వాణ. మరి ఈ దర్శకుడు ఎవరితో సినిమా చేయబోతున్నాడంటూ చర్చించుకుంటున్న వారి కోసం ఆసక్తికర వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. ఇంతకీ ఆ హీరో ఎవరనే కదా మీ డౌటు.. ఇంకెవరో కాదు టాలీవుడ్ యాక్టర్ రవితేజ.వితేజ అంటే మాస్ అప్పీల్, ఎనర్జిటిక్ డ్యాన్స్, యాక్షన్, కామెడీ, రొమాన్స్..ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉంటాయని తెలిసిందే. శివనిర్వాణతో రవితేజ సినిమా చేయబోతున్నాడన్న వార్త ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. లీడింగ్ ప్రొడక్షన్ హౌజ్ మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమా తెరకెక్కించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. అంతేకాదు ఈ సారి రవితేజ రూటు మార్చి థ్రిల్లర్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడట. ఇప్పటిదాకా లవ్ స్టోరీలతో ఇంప్రెస్ చేసిన శివనిర్వాణ థ్రిల్లర్ జోనర్‌లో చేస్తున్న తొలి సినిమా కావడంతో ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. శివ నిర్వాణ, రవితేజ ఇద్దరు తమ రూటులను మార్చి ఒకే ప్రాజెక్టుకు పనిచేయడం మూవీ లవర్స్‌కు పండగే అని చెప్పాలి.



# మీనాక్షి ఇంట్రెస్టింగ్ కామెంట్..

### ఉదయం ముద్దు పెట్టుకున్నట్టు, రాత్రి అక్కడ ఉన్నట్టు అనిపించింది..

టాలీవుడ్‌లో స్టార్‌డమ్‌ను సొంతం చేసుకున్న కథానాయికల్లో మీనాక్షీ చౌదరీ పేరు ముందు వరుసలో ఉంది. అతి తక్కువ కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ దక్షిణాది ఇండస్ట్రీలలో 'లక్కీ ఛార్మ్'గా మారిపోయింది. ఇండస్ట్రీలో అడుగుపెట్టి ఐదేళ్లే అయినా, మీనాక్షీ చౌదరీ పేరు ఇప్పుడు టాప్ హీరోయిన్‌ల సరసన వినిపిస్తోంది. మొదట అక్కినేని సుశాంత్‌తో చేసిన 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' సినిమాతో తెరంగేట్రం చేసింది. ఆ తర్వాత రవితేజతో కలిసి 'ఖిలాడీ' లో నటించింది. ఈ రెండు సినిమాలు కమర్షియల్‌గా ఫలించకపోయినా, ఆమె నటనకు మాత్రం మంచి గుర్తింపు వచ్చింది.అయితే ఆ తర్వాత చేసిన సినిమాలు ఆమెను అగ్రనాయికల సరసన నిలబెట్టాయి.లక్కీ భాస్కర్ సినిమాలో 'సుమతి' పాత్రలో నటించి మెప్పించింది. సినిమా భారీ హిట్ కాకపోయినా, మీనాక్షీకి మాత్రం అది మైలురాయి లాంటిది అని చెప్పాలి. ఆ తర్వాత గుంటూరు కారం, విజయ్ తలపతి నటించిన గోట్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో వరుసగా మూడు భారీ విజయాలు సాధించింది.లక్కీ భాస్కర్ ?100 కోట్లు రాబట్టగా, గోట్ ?450 కోట్లు, సంక్రాంతికి వస్తున్నాం ?300 కోట్లుకి పైగానే వసూళ్లు రాబట్టింది. మొత్తానికి మీనాక్షి నటించిన ఈ మూడు సినిమాలు దాదాపు 800 కోట్లకి పైగా కలెక్ట్ చేయడం విశేషం. ఇక మీనాక్షి ఇటీవల తన పేరులో చిన్న మార్పు చేసింది. ఇంగ్లీష్‌లో 'Meenakshi'గా ఉండే పేరులో, అదనంగా ఒక A జోడించి Meenaakshi 'గా మార్చుకుంది. ఈ మార్పు వెనుక కారణం కెరీర్ లో ఎదగడం కోసమా లేకుంటే ఆధ్యాత్మిక విశ్వాసమా? లేక న్యూమరాలజీ ప్రభావమా అన్నది స్పష్టంగా తెలియదు. ఆ మధ్య వరసగా సినిమాలు చేసిన మీనాక్షి చౌదరి.. కొన్ని నెలలుగా సందడి చేయడం లేదు. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత ఈమె సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చినట్టు కనిపిస్తుంది. ప్రస్తుతం నాగ చైతన్య, కార్తిక్ దండు సినిమాతో పాటు.. అనగనగా ఒకరాజులో చిత్రంలో నటిస్తుంది మీనాక్షి. ఈ గ్యాప్‌లో సోషల్ మీడియాలో అదిరిపోయే హాట్ షో చేస్తూ నెటిజన్స్‌ని ఎంతగానో ఆకట్టుకుంటుంది. అయితే ఈ భామ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఉదయం సూర్యుడిని ముద్దు పెట్టుకున్నట్టు, సాయంత్రం నక్షత్రాల మధ్య ఉన్నట్టు అనిపించిందని మీనాక్షి కామెంట్ చేసింది.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**